క్లుప్తంగా

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో మేధినరావుపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రధానోపాధ్యాయుడు వి.హరి సీతారామయ్య తెలిపారు. అండర్ 17 విభాగంలో బి.హిమవంశీకృష్ణ సిల్వర్ మెడల్ బి.రత్న బాలాజీ బ్రాంజి మెడల్ సాధించాడని, వీరిని శనివారం పాఠశాలలో హెచ్ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్ అభినందించారు.

సమాధుల పండుగకు ఏర్పాట్లు



సమాధులను శుభ్రం చేస్తున్న దృశ్యం

దెందులూరు: సమాధుల పండుగకు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబర్ 2న జరిగే సమాధుల పండుగలో మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు సమాధుల తోటలకు వచ్చి సమాధులను రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. దెందులూరు సమాధి తోటలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఎం అమ్మస్ రాజా పనులను పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీ ఓటు హక్కుపై అవగాహన

దెందులూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు నవంబర్ 6వ తేదీ వరకు గడువు ఉందని, డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్, ఓటర్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, మొబైల్ నెంబర్ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ఓటు నమోదుకు జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ అటాస్టేషన్ ఉండాలని, సమీప నిర్దేశిత కేంద్రాల్లో దరఖాస్తు ఇవ్వాలని వివరించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణులు

నిడమర్రు: కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి కె.భాగ్యశ్రీ అన్నారు. శనివారం పెదనిండ్రకొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 225 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 16 మందికి దృష్టిలోపం ఉందని, 15 మందికి కళ్లజోళ్లు అవసరమని, ఒకరిని జిల్లా కేంద్రానికి రిఫర్ చేశామని డాక్టర్ భాగ్యశ్రీ తెలిపారు. కంటి వైద్య నిపుణులు జె.వెంకట రెడ్డి, హెచ్ఎం టీవీ సత్యనారాయణ, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా తరగతుల నిర్వహణ



ఎంఈఓ బాలయ్యకు వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నేతలు

గణపవరం: ప్రైవేటు విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయాల్లో, సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు గణపవరం ఎంఈఓ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లి ఎంఈఓ జి.బాలయ్యకు వినతిపత్రం అందజేశారు. గణపవరం మండలం సరిపల్లెలోని ఒక విద్యాసంస్థ రాత్రి 9 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తుందన్నారు. దీనిపై విద్యాసంస్థకు వెళ్లి పరిశీలించి, ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎంఈఓను కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ ఉంగుటూరు నియోజకవర్గ అధ్యక్షుడు కె.జితేంద్రనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

పీపీఈ కిట్ల అందజేత

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ సిబ్బంది, ప్రైవేట్ సెప్టిక్ ట్యాంక్ సిబ్బంది 62 మందికి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం ఉదయం మేయర్ చాంబర్లో పీపీఈ కిట్లను అందజేశారు. ఈ కిట్లలో చేతి గ్లౌజులు, ఫుల్ షూట్ డ్రెస్సు, గంషూ, హెల్మెట్, గ్యాస్ మాస్క్, కళ్లద్దాలు మొదలగునవి ఉన్నాయి.

గోతుల రోడ్లు.. ప్రజలకు అవస్థలు

- కనీసం గోతులూ పూడ్చని వైనం
- గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా చేపట్టని పనులు
- వాహనచోదకుల ఆవేదన



అధ్వానంగా మారిన గుండుగొలను నుంచి భోగాపురం రోడ్డు

భీమడోలు: మండలంలోని ప్రధాన రోడ్లన్నీ గోతులమయంగా మారి ప్రమాదఘంటికలు మోగిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా మారాయి. రోడ్లపై అడుగు అడుగునా గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్లపై రాకపోకల సమయంలో ఏ క్షణంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయపడిపోతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. అధికారంలోకి రాగానే రోడ్లు నిర్మిస్తామంటూ ఊకదంపుడు ప్రచారాలు చేసిన కూటమి ప్రభుత్వం నేడు ఆ ఊసే ఎత్తడం లేదు. నాలుగు నెలలు గడిచినా కనీసం రోడ్లపై గుంతలు కూడా పూడ్చకుండా కాలయాపన చేస్తోంది. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు ఉన్న మూడు కిలోమీటర్ల మినీ బైపాస్ రోడ్డు శిథిలావస్థకు చేరింది. భారీ గోతులు ఏర్పడ్డాయి. ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులు తమ బైక్‌లపై ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. వివిధ డిపోల బస్సులు రహదారిపై ప్రయాణిస్తున్నాయి. ఇంతటి ప్రాధాన్యత గల రోడ్డును ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోవడం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ రహదారికి మరమ్మతుల నిమిత్తం రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినా నేటికి ఆ పనులు ప్రారంభించలేదు. ఇదే విషయాన్ని భీమడోలు సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు సభ్యులు లేవనెత్తారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం నుంచి సాయన్నపాలెం వరకు ఏడు కిలో మీటర్ల రహదారి చిన్నపాటి వర్షానికి అధ్వానంగా మారుతుంది. ఈ రహదారిపై వాహనాలు ప్రయాణించాలంటేనే భీతిల్లిపోతున్నారు. ఈ మార్గంలో అత్యవసర పరిస్థితుల్లో సాయంపాలెం గ్రామం నుంచి పూళ్లకు ఆటోవాలాలు రావడంలేదు. రాత్రి పూట రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో బీటీ రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్‌కు నిధులు కూడా మంజూరు చేసింది. టెండర్ల దశలో నిలిచిపోయింది. గుండుగొలను నుంచి భోగాపురం రోడ్డు దారుణంగా మారింది. చిన్నపాటి వర్షం వస్తే నడకే కష్టంగా మారింది. వాహనాలపై వెళ్లే వారంతా ఆదమరిస్తే ఆసుపత్రుల పాలవ్వక తప్పదని వాపోతున్నారు. గుండుగొలను నుంచి కోరుకొల్లు రోడ్డు, సూరప్పగూడెం నుంచి పాతూరు, భీమడోలు కోమటిగుంట రోడ్లపై రాకపోకలు ప్రాణసంకటంగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినా గోతులను పూడ్చే ప్రయత్నాలు సాగించకపోవడంతో ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా గుంతలు పూడ్చించాలని వారంతా కోరుతున్నారు.

రాష్ట్రీయ రహదారి మనుగడకు ముప్పే



చిలకంపాడు వద్ద రాష్ట్రీయ రహదారిపై నిలిచిన నీరు

గణపవరం: పెంటపాడు మార్టేరు రాష్ట్రీయ రహదారిపై చిలకంపాడు గ్రామం వద్ద రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో రోడ్డు మనుగడకు ముప్పుగా మారింది. ఈ రహదారిని గ్రామం పరిధిలో సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ సదుపాయం లేదు. రోడ్డు మార్జిన్లు ఎవరికివారు మెరక చేయడంతో రోడ్డుపై నీరు బయటకుపోయే మార్గంలేదు. ఇళ్లలోని వాడకం నీరు, వర్షం నీరు రోడ్డుపైకి చేరి రోజుల తరబడి నిల్వ ఉంటుంది. ఈనీటి గుండానే వాహనాల రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు మనుగడకు ముప్పుగా మారింది. కచ్చా డ్రెయిన్లు ఏర్పాటుచేసి నీరు నిల్వ లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



గోతులతో నిండిన భీమడోలు మినీ బైపాస్ రోడ్డు



భీమడోలు జంక్షన్ వద్ద భారీ గుంతల్లో నిలిచిన నీరు



సాయన్నపాలెం నుంచి ఎంఎంపురం రోడ్డు దుస్థితి

కబడ్డీ పోటీలకు పూళ్ల విద్యార్థి



క్రీడాకారుడు నఫీరుద్దీన్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

భీమడోలు: పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎస్‌కే నఫీరుద్దీన్ అండర్-17 కబడ్డీ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం పి.భువనేశ్వరరావు తెలిపారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నఫీరుద్దీన్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఏలూరులోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన నఫీరుద్దీన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం తెలిపారు. ఈనెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్టు చెప్పారు. పీడీ కె.రాహుల్, క్రీడాకారుడిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఎం సీతారామయ్య, ఎల్ గంగరాజు, సిబ్బంది అభినందించారు.

తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు



అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

దెందులూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల ఏర్పాటుకు రూ.36 వేలు, తాగునీటి సరఫరాకు రూ.17 వేలు ప్రభుత్వం మంజూరు చేసిందని మండలం గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారి (ఆర్‌డబ్ల్యూఎస్) ఏఈ చింతమనేని వర్మ అన్నారు. శనివారం దెందులూరు మండలం దెందులూరు గ్రామంలోని దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో మంచినీటి పైపులైను, వ్యక్తిగత మరుగుదొడ్లను వర్మ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గీతా, లక్ష్మీదేవి, శ్రావణిలు పరిశీలించారు. దోసపాడు, సోమవరప్పాడు, కొవ్వలి, చల్లపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల ఏర్పాటు, మంచినీటి సరఫరాకు చర్యలను తీసుకున్నట్టు వర్మ చెప్పారు.

కేరళ తరహాలో బోనస్ ఇవ్వాలి



కురెళ్లగూడెంలో రైతులకు కరపత్రాలను అందిస్తున్న నాయకులు

భీమడోలు: పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా ధాన్యానికి మద్దతు ధర పెంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. ఈనెల 29న కైకరంలో ధాన్యం మద్దతు ధర, కొనుగోళ్ల సమస్యలపై చేపట్టే రైతు సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ శనివారం పూళ్ల, కురెళ్లగూడెం, భీమడోలు తదితర గ్రామాల్లోని రైతులు, కౌలు రైతులకు కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. కేంద్ర ప్రకటించిన మద్దతు ధర రైతులకు గిట్టుబాటు కాదని, సాగు చేసే వారిలో అత్యధిక శాతం కౌలు రైతులేనని, కౌలుతో కలుపుకుని పెట్టుబడి తడిసి మోపుడవుతుందని వివరించారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వకుంటే రైతులకు ఎండిగడ్డి కూడా మిగలదని తెలిపారు. కేరళ తరహాలో ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం బోనస్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతుల జిల్లా కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

వివాదాలకు తావివ్వకుండా ఓటు హక్కు



వీఆర్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: సాగునీటి సంఘాలకు సంబంధించి రైతులకు ఓటు హక్కు కల్పించే విషయంలో వివాదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ డివిజనల్ ఇంజినీర్ గనిరాజు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.సుమతితో కలిసి ఆయన వీఆర్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గనిరాజు మాట్లాడుతూ ఫారం-ఏ రూపకల్పన త్వరితగతిన జరగాలన్నారు. రైతులకు ఓటు హక్కు కల్పించే విషయంలో పూర్తి ఆధారాలతో ఒకటి రెండు సార్లు సరిచూసుకోవాలని అన్నారు. పూర్వపు లిస్టులను పరిశీలించి నిర్ధారించుకోవాలన్నారు. తహసీల్దార్ సుమతి మాట్లాడుతూ సాగునీటి సంఘాలు ఎన్నికలు నిర్వహణ ఓటు హక్కు కల్పన విచారణ విషయాల్లో వీఆర్‌ఓలు నిబంధనలకు లోబడి పనిచేయాలన్నారు. ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే విచారణలో నిరూపణ అయితే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. డీటీ కృష్ణస్వామి, ఆర్‌ఐ హేమమాలిని, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే అనుమతులు రద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

భీమడోలు: బాణసంచా విక్రయ దుకాణదారులు నిబంధనలు పాటించకుంటే లైసెన్సులు రద్దు చేస్తామని తహసీల్దార్ బి.రమాదేవి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వివిధ శాఖల అధికారులకు, శాశ్వత, తాత్కాలిక మందుగుండు సామగ్రి విక్రయదారులకు అనుమతులు, భద్రతా చర్యలు తదితర అంశాలపై ఆమె సమావేశం నిర్వహించారు. దీపావళి ప్రతి ఇంటా ఆనందంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. మందుగుండు సామగ్రి దుకాణాల వద్ద అగ్నిమాపక శాఖ సూచనలను విధిగా పాటించాలన్నారు. తాత్కాలిక దుకాణాలు గ్రామానికి శివారు ప్రాంతాల్లో ఉండేలా పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖ సిబ్బంది తగు శ్రద్ధ వహించాలని ఆదేశించారు. దీపావళి రోజు ప్రమాదాలు సంభవించకుండా సంబంధిత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. దుకాణాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని, విద్యుత్ వైర్లు ఉన్న ప్రాంతాల్లో దుకాణాలు పెట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి నాగరాజు, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి, ఎంఈఓ ఈదుపల్లి శ్రీనివాసరావు, ఆర్‌ఐ కిరణ కుమారి, వీఆర్వోలు, మందుగుండు దుకాణదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్‌తోనే ప్రాణాలకు రక్షణ



హెల్మెట్ ధారణపై అవగాహన కలిగిస్తున్న రవాణా, పోలీస్ అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరిస్తేనే ప్రాణాలకు రక్షణ ఉంటుందని రవాణా తనిఖీ అధికారి భీమారావు, ట్రాఫిక్ సీఐ లక్ష్మణ్ అన్నారు. నగరంలోని ఫైర్ స్టేషన్ సెంటర్, గాంధీ మైదానం, వట్లూరు ప్రాంతాలలో రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధికారులు ఒకటో పట్టణ పోలీసు అధికారులు సంయుక్తంగా హెల్మెట్ ధారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. సీఐ సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ లక్ష్మణ్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ భీమారావు మాట్లాడుతూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలను నడపాలని సూచించారు. ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారు మృత్యువాత పడుతున్నారని హెచ్చరించారు. హెల్మెట్ వాడకుండా ద్విచక్ర వాహనాలను నడుపుతున్న వారికి హెల్మెట్లను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జి.స్వామి, ఎస్ నెహ్రూ, బి.నరేంద్రబాబు, వైఎస్‌వీ కళ్యాణి, బి.ప్రజ్ఞలతో పాటు ట్రాఫిక్ ఎస్సై రంగారావు, ట్రాఫిక్ సిబ్బంది, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడాలి



వాల్ పోస్టర్ విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్) : రాష్ట్రంలో అతి పెద్ద పరిశ్రమగా ఉన్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించకుండా కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ఎన్డీఏ ప్రభుత్వానిదేనని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే అన్నారు. అక్టోబర్ 31న నిర్వహించే ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవ వాల్‌పోస్టర్‌ను శనివారం ఆర్ఆర్‌పేట ఎస్ఆర్‌టు వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు విడుదల చేశారు. డాంగే మాట్లాడుతూ ఏఐటీయూసీ సాధించిన కార్మిక చట్టాలను కేంద్రంలో మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. ఎన్నికల హామీ మేరకు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడాలని లేకుంటే రాష్ట్రంలోని ఎన్డీఏ పార్టీలకు ప్రజానీకం తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ వ్యవస్థాపకుడు చిలుకూరి రమేష్ కుమార్, కోశాధికారి బి.నారాయణరావు నాయకులు నారా శ్రీనివాసరావు, ఎస్ఎంవీ సుబ్బారావు, డి.రవి, పీఎస్‌జీ కుమార్, వంగపండు, శివ, ఎ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ భారం వద్దు

ఏలూరు (టూటౌన్): ప్రజలపై సర్దుబాటు చార్జీల భారాన్ని రద్దు చేయాలని చేతి వృత్తిదారుల సమన్వ య కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో-కన్వీనర్ ఆగొల్ల వెంకట కృష్ణారావులు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏఎఫ్‌పీపీసీఏ చార్జీల పేరిట ప్రజలపై రూ. 6,072 కోట్లు భారాన్ని విధిస్తూ ఏపీ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించు కో వాలని కోరారు. ప్రపంచ బ్యాంకు ఆదేశాల్లో అంతర్భాగమైన షరతుల్లో ఇది ముఖ్యమైందని పేర్కొన్నారు.

కబడ్డీ పోటీలకు ఉర్దూ పాఠశాల విద్యార్థి

ఏలూరు రూరల్ : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఏలూరులోని మౌలానా అబ్దుల్ కలామ్ మునిసిపల్ కార్పొరేషన్ ఉర్దూ పాఠశాల విద్యార్థి ఎస్‌కే ఇద్రీస్ ఎంపికయ్యాడని హెచ్‌ఎం ఎస్‌కే కాజిద బేగం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు అండర్-14 విభాగంలో ఇద్రీస్ సత్తా చాటాడని పేర్కొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

దెందులూరు : అన్ని గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శనివారం సానిగూడెం సచివాలయంలో గ్రామ సర్పంచ్ సరిపల్లి రామకృష్ణ (విష్ణు) అధ్యక్షతన మండల సర్వేయర్ రమణారావు ఆధ్వర్యంలో రెవెన్యూ రీసర్వే గ్రామసభ నిర్వహించారు. పలువురు రైతులు సమస్యలో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్‌కు అందజేశారు. ఇప్పటివరకు మండలంలో 90 పైగా రైతులు భూ సమస్యలపై వినతి పత్రాలు వచ్చాని సుమతి తెలిపారు. డీటీ కృష్ణస్వామి, ఆర్‌ఐ హేమమాలిని, మాజీ సర్పంచ్, వీఆర్‌ఓ ప్రసాద్, రైతులు ఉన్నారు.

ఉపాధి పనుల గుర్తింపు సభ

ఉంగుటూరు: ఉపాధి హామీ 2025-26వ సంవత్సరానికి సంబంధించిన పనుల గుర్తింపు సభను శనివారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ దిడ్ల అలకానంద అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీటీసీల చాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, కార్యదర్శి విజయ కుమార్, ఉపసర్పంచ్ మరడ సాంబశివారావు, సభ్యులు పాల్గొన్నారు.

ధన్వంతరి జయంతి

ఉంగుటూరు: ధన్వంతరి జయంతి సందర్భంగా శనివారం ఉంగుటూరు డాక్టర్ సుంకవల్లి విజ్ఞాన భారతి పాఠశాలలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఆయుర్వేద మూల సిద్ధాంతాలపై అవగాహన కల్పించారు. మెటర్నరీ సహాయకురాలు కృష్ణకుమారి, విజయలక్ష్మి, టీచరు తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు ఇన్‌చార్జి కార్యదర్శిగా అనూష

దెందులూరు: స్థానిక గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఎం అనూష ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సచివాలయం కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాస్ చౌదరి వేల్పుచర్ల గ్రామ సచివాలయానికి బదిలీపై వెళ్లడంతో వట్లూరు సచివాలయం నుంచి అనూష బదిలీపై వచ్చారు. దెందులూరు గ్రామ సచివాలయాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని అనూష చెప్పారు. పారిశుద్ధ్యం మెరుగుదల, తాగునీటి పరఫరాకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



భగవద్గీత పుస్తకాల పంపిణీ చేస్తున్న రామదండు కమిటీ సభ్యులు

దెందులూరు: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో దెందులూరు రామదండు సమక్షంలో భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశామని రామదండు కమిటీ సభ్యులు సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. శనివారం దెందులూరులో గారపాటి హైమావతి దేవి జిల్లా పరిషత్ హై స్కూల్, మండల ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రజ్ఞా పబ్లిక్ స్కూళ్లలో వెయ్యి మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రతిరోజూ కనీసం ఒక శ్లోకాన్ని చదివి అర్థం చేసుకుని జీవితానికి అన్వయించుకుని ఆచరిస్తే భవిష్యత్తు బాగుంటుందని రామదండు కమిటీ సభ్యులు తెలిపారు.

దానిరెడ్డికి పరామర్శ



దానిరెడ్డిని పరామర్శిస్తున్న వాసుబాబు

గణపవరం: మండలంలోని ముప్పర్తిపాడు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా దానిరెడ్డి తనయుడు గోపిరెడ్డి మరణం తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గోపిరెడ్డి చిత్రపటం వద్ద వాసుబాబు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ దండు రాము, సర్పంచ్ కర్రి రాధాలక్ష్మీ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పిల్లి సంతోషం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అయ్యప్పల భిక్ష కార్యక్రమం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దొండపాడు శ్రీ బాల అయ్యప్ప క్షేత్రంలో ఈ నెల 27 ఆదివారం నుంచి శ్రీ అయ్యప్ప స్వామి మండల దీక్ష స్వాములకు 13వ వార్షిక భిక్ష కార్యక్రమం ప్రారంభించనున్నట్టు క్షేత్రం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యం మధ్యాహ్నం 12 గంటలకు భిక్ష ప్రదాతచే స్వామి వారికి పూజ, మహా నైవేద్యం, మహా హారతి నిర్వహించిన అనంతరం స్వాములు, భవానీలు, శివ, గోవింద స్వాములకు భిక్ష అందజేస్తామని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు లక్ష్మీ గణపతి హోమం, అయ్యప్ప తారక మంత్ర హోమం, పూర్ణాహుతి ఉంటాయని తెలిపారు.

యోగ, క్రీడలతో మేధస్సు మెరుగు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యోగ, క్రీడలు, వృత్తి విద్యల్లో శిక్షణ ఇవ్వడం వల్ల వారి మానసిక ఆరోగ్యం, మేధస్సు మెరుగుపడుతుందని దివ్య కంప్యూటర్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ బీఎస్ శివారెడ్డి అన్నారు. శనివారం స్థానిక డీసీఈఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పాఠశాల విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో యోగ, క్రీడలు, ఒకేషనల్ టీచర్లను కాంట్రాక్టు పద్ధతిపై నెలకు రూ.15,500 వేతనంతో నియమించనున్నట్టు చెప్పారు. ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన అర్హులు ఫోన్ నెంబర్ 79953 55985లో సంప్రదించాలన్నారు. సమావేశంలో విద్యాంజలి 2.ఓ పథకంలో ఎన్‌రోల్ అయిన డీసీఈఎస్ డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.